## క్లుప్తంగా

### మూర్ఛ అంటు వ్యాధి కాదు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల

కాకినాడ రూరల్: నాడీ వ్యవస్థపై మాత్రమే ప్రభావం చూపించే మూర్ఛ అంటు వ్యాధి కాదని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మెదడు నుంచి వెలువడే ఆదేశాలు విద్యుత్ సంకేతాల రూపంలో నరాల ద్వారా ఆయా అవయవాలకు చేరుతాయన్నారు. ఆ వ్యవస్థలో లోపాల వలన రోగి కదలికలు, ప్రవర్తన, జ్ఞానేంద్రియాల పని తీరు అన్నింటిలోనూ మార్పులు వస్తాయన్నారు. తీవ్రమైన వణుకు, నోటి నుంచి చొంగ కారడం, నాలుక కరచుకోవడం మూర్ఛ వ్యాధి లక్షణాలని వివరించారు. మందులు వాడడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అసైన్డ్ భూమి ఇప్పించాలని వినతి

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో అన్యాక్రాంతమైన తమ కుటుంబ సభ్యుల అసైన్డ్ భూమిని తిరిగి ఇప్పించాలని ఆ గ్రామానికి చెందిన కుడిపూడి శివ దుర్గాప్రసాద్ కలెక్టర్‌కు సోమవారం కలెక్టరేట్‌లో విజ్ఞాపన అందించారు. తిమ్మాపురంలో 1978లో వ్యవసాయ కూలీగా ఉన్న తలుపులమ్మకు సర్వే నంబరు 186/8లో 83 సెంట్ల భూమికి అసైన్డ్ పట్టా ఇచ్చారన్నారు. తన తండ్రి వీర సత్య రాఘవరావు నుంచి దానిని ఇద్దరు వ్యక్తులు తీసుకుని అన్యాక్రాంతం చేశారని అందులో పేర్కొన్నారు. పేదరికంలో ఉన్న తమ కుటుంబానికి ఆ భూమిని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### దేశ, దైవభక్తితోనే జాతి పురోగతి

బోట్‌క్లబ్: దేశభక్తితో కలిగలిపిన దైవభక్తితోనే జాతి పురోగతి సాధ్యమని వాత్సల్య భారతి అధ్యక్షుడు ఎంవీ కుమారస్వామి అన్నారు. సంస్థ సభ్యులు మద్దాలి శ్రీనివాసరావు, పొన్నాడ శేఖర్, కవి మురళీకృష్ణ సంయుక్త ఆధ్వర్యాన స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామికి సోమవారం బిల్వార్చన, అమ్మ వారికి కుంకుమార్చన భరతమాత పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్ అరిందం కుమార్, జిల్లా కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

### 'అపార్'పై ప్రత్యేక దృష్టి సారించాలి

కాకినాడ సిటీ: అపార్ ఐడీ నమోదుపై సంబంధిత స్పెషల్, నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. అపార్ ఐడీ నమోదు వేగవంతం చేయాలని, అవసరమైతే స్కూలుకు వెళ్లి నమోదు ప్రక్రియ పరిశీలించాలని సూచించారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌లో మార్పులు ఉంటూ వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అపార ఐడీ నమోదుపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి అపార్ ఐడీ వివరాలను యూడైస్ ప్లస్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. సాంకేతిక ఇబ్బందులు వెంటనే సరిదిద్దాలన్నారు. రాబోయే కాలంలో ఈ ఐడీకి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కాకినాడ అర్బన్ పరిధిలో నూరు శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ పృథ్వీ చరణ్, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ శిఖర ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



పూజలో పాల్గొన్న ఆర్‌జేసీ సుబ్బారావు దంపతులు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో శిఖర ప్రతిష్ఠ మహోత్సవం కోసం పూజా కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠ చేయనున్నారు. తొలి రోజు పూజల్లో భాగంగా పంచామృత అభిషేకంలో రాజమహేంద్రవరం ఆర్‌జేసీ కె.సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు. దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ సుబ్బారావుకు ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, సిబ్బంది స్వాగతం పలికారు.

# కలసిరాని కోతలు

- జోరుగా సార్వా మాసూళ్లు
- పెరిగిన కూలీ రేట్లతో ఇబ్బందులు
- పెట్టుబడి పెరుగుతుందంటున్న రైతులు
- మిగిలేది అంతంతమాత్రమేనని ఆవేదన



పాతర్లగడ్డలో సార్వా పంట కోస్తున్న కూలీలు

కరప: సార్వా కోతలు జోరుగా సాగుతున్నాయి. ముదరగా ఊడ్చిన పొలాలు కోతకు రాగా, లేతగా నాటిన చేలు పక్వ దశకు చేరుకున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో వరి కోతలు ప్రారంభం కావడంతో రైతులు తొలకరి పనుల్లో తలమునకలయ్యారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం 18,414 ఎకరాలు ఉండగా, కరప మండలంలో 13,952 కాకినాడ రూరల్‌లో 4,462 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 80 శాతం ఎంటీయూ-7629(స్వర్ణ) రకం, 18 శాతం మేర ఎంటీయూ-1318, మరో రెండు శాతం ఇతర రకాలు సాగు చేశారు. కూలీ రేట్ల నుంచి ఎరువులు, పురుగు మందుల వరకు ధరలు పెరిగిపోవడంతో సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయని రైతులు చెబుతున్నారు. సీజన్ ఆరంభంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, రైతులు కోటి ఆశలతో ఖరీఫ్ సాగు చేశారు. మెరక ప్రాంతాల్లోను, కాలువ శివారు భూముల్లో సాగు ఆలస్యమైంది. సీజన్ ప్రారంభంలో నైరుతి రుతు పవనాలు మొండికేయడం, కాలువలకు సాగునీరు వదలడం ఆలస్యమవ్వడం తదితర కారణాలతో మండలంలో ఖరీఫ్ నాట్లు ఆలస్యం కావడంతో, కోతల్లో కూడా జాప్యం జరుగుతోందని రైతులు అంటున్నారు.

**వాతావరణంతో ఇబ్బందులు**

వాతావరణం అనుకూలంగా ఉండడంతో తొలకరి పంట దిగుబడులు బాగున్నాయని సంబరపడిన రైతులకు గత నెల తొలి వారంలో వర్షాలు, ఈదురు గాలులకు వరిచేలు నేలనంటాయి. ఈదురు గాలులకు ఈనిక దశలో ఉన్న వరిచేల పుప్పొడి రేణువులు రాలిపోయి, పాలు పోసుకోక తప్పతాలు గింజలుగా మారాయని రైతులు అంటున్నారు.

**ముమ్మరంగా కోతలు**

ముందుగా ఊడ్చిన పొలాల్లో వరిచేలు పక్వదశకు చేరుకోగా, రైతులు కోతలు చేపట్టారు. మెషీన్‌తో కోయించడానికి ఎకరాకు రూ.2,800 నుంచి రూ.3,500 తీసుకుంటున్నారు. కూలీలతో కోయించడానికి మగవారికి రూ.900, మహిళా కూలీలకు రూ.400 తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. కరప, నడకుదురు, సిరిగలపల్లంక, వేళంగి, అరట్లకట్ట , వేములవాడ, వాకాడ, కూరాడ, యండమూరు. జి.భావారం తదితర గ్రామాల్లో కోతలు ముమ్మరంగా చేపట్టారు. సాగునీరు సక్రమంగా అందిన ప్రాంతాల్లో సార్వా పంట ఆశాజనకంగా ఉందని, కాలువ శివారు, మెరక ప్రాంతాల్లో నీరందని చోట పంట దెబ్బ తిన్నట్టు రైతులు చెబుతున్నారు.

### సస్యరక్షణ చర్యలు

పగలు అధిక ఉష్ణోగ్రతలు, రాత్రులు తేమగా ఉండటం తదితర ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కొన్ని పంట తెగుళ్లు ఆశించినా,, సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అవి తగ్గుముఖం పట్టాయంటున్నారు. పడిపోయిన చేలు కోయడానికి రెండు, మూడు కూళ్లు అధికంగా అవుతాయని రైతులు అంటున్నారు. పెరిగిన పెట్టుబడులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే 75 కిలోల బస్తా రూ.2 వేలు తక్కువ కాకుండా ప్రభుత్వ మద్దతు ధర ఉండాలని రైతులు అంటున్నారు. లేకపోతే వ్యవసాయం చేయలేమంటున్నారు. వరి పంట కోసి, వెంటనే నూర్పిడి చేసి అమ్మితే 75 కిలోల బస్తా రూ.1,450 కొనుగోలు చేస్తున్నట్టు రైతులు తెలిపారు.

### సార్వా కోతలు 35 శాతం



మండలంలోని వివిధ గ్రామాల్లో సార్వా కోతలు జోరుగా సాగుతున్నాయి. ఇంతవరకు 35 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు 16 ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఇప్పటి వరకు 300 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగానే ఉంది. రైతులకు ఎప్పటికప్పుడు మాసూళ్లు, మద్దతు ధరపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప

### కూలీ రేట్లు పెరిగిపోయాయి



సార్వా సీజన్‌లో ఎరువులు, పురుగు మందుల రేట్లు పెరిగిపోవడంతో పెట్టుబడులు ఎక్కువయ్యాయి. కూలీ రేట్లు కూడా పెరిగిపోయాయి. వాతావరణం కొద్దిపాటి మబ్బుగా ఉన్నా, కూలీలు దొరక్క యాతన పడుతున్నాం. సార్వా పంట కోసిన వెంటనే ధాన్యం ఆరబెట్టకుండా ఉబ్బడాల ధాన్యం అమ్మితే 75 కిలోల బస్తాకు రూ.1,450 ఇస్తున్నారు. ఆరుదల ధాన్యమైతే రూ.1,650కు కొంటున్నారు. ఆర్‌బీకేల చుట్టూ తిరగలేక కమీషన్ వ్యాపారులకే అమ్ముతున్నాం. కూలీ ఖర్చులు భరించలేక ఉబ్బడాల ధాన్యం అమ్ముతున్నాం.

– పెంకే అప్పన్న, కౌలు రైతు, కరప

### ఎన్నికల పరిశీలకుడిని కలిసిన కలెక్టర్



హర్షవర్ధన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: తూర్పు.-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన కె హర్షవర్ధన్ సోమవారం సాయంత్రం కాకినాడకు విచ్చేశారు. కాకినాడ రామకోస అతిథి గృహంలో ఆయనను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షణ్మోహన్ సగిలి, సహాయ రిటర్నింగ్ అధికారి జె వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

### వామనావతారంలో సీతారామ స్వామి



బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న సీతారామస్వామి వామనావతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డగోలుగా గోడ నిర్మాణం
- తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ



జేసీ రాహుల్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న మాజీ కౌన్సిలర్ సిగల మధు, నాయకులు

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలోని ఏడో డివిజన్ రేచర్లపేట ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ సిగల మధు, స్థానిక నాయకులు తొంపల తాతారావు, బత్తిన రాజు, నందకుమార్ సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రేచర్లపేటను ఆనుకుని ఉన్న లక్ష్మీనారాయణనగర్ ప్రాంతంలోని నారాయణ-శ్రీచైతన్య కళాశాలల సమీపంలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రహరీ నిర్మించినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం అక్కడ రహదారి నిర్మించేందుకు కేటాయించిన స్థలంలో కొంత భాగాన్ని రోడ్డు వేయగా, మిగిలిన స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించే క్రమంలో ప్రహరీ నిర్మించారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పూర్తిగా నగరపాలక సంస్థకు చెందిన ఈ స్థలంలో చేపట్టిన అక్రమ గోడ నిర్మాణాన్ని తక్షణమే తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లక్షలాది రూపాయల విలువైన స్థలాలకు రక్షణ చర్యలు లేకపోతే భూ కబ్జాలు పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు.

**కమిషనర్ చొరవ చూపాలి**

విలువైన నగరపాలక సంస్థ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అత్యంత విలువైన స్థలాలను పరిరక్షించే విషయంలో పట్టించుకోకపోతే భూ కబ్జాదారుల ఆగడాలు పెరిగి, అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందంటున్నారు. ఐఏఎస్ అధికారిగా ఉన్న కమిషనర్ భావన ఇటువంటి ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ: నగరంలోని సాంబమూర్తినగర్ లక్ష్మీనగర్ ప్రాంతంలో నిర్మించిన అక్రమ కట్టడాలను నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. 'డ్రైనేజీలను వదలరా?' శీర్షికన ఈ నెల 17న 'సాక్షి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. డ్రైనేజీని ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా ఆరు షాపులను నిర్మిస్తున్న తీరుపై 'సాక్షి'లో కథనం వచ్చిన నేపథ్యంలో కమిషనర్ భావన స్పందించారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి అధికారులను ఆరా తీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణం చేసినట్టుగా నిర్ధారణకు వచ్చారు. దీంతో తక్షణమే ఆ నిర్మాణాలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయాన్నే ఆయా దుకాణాలను కూల్చివేశారు. అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలను నిర్మిస్తే ఉపేక్షించబోమని టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు.



డ్రైనేజీపై నిర్మించిన దుకాణాలు



టౌన్‌ప్లానింగ్ అధికారులు దుకాణాలను తొలగించిన తర్వాత..

### కనులపండువగా కోటి దీపాలు



వాకాడలో వెలిగించిన కార్తిక కోటి దీపాలు

కరప: మండలంలోని వాకాడలో సోమవారం రాత్రి కార్తిక కోటి దీపాల సంబరం కనుల పండువగా జరిగింది. ఆకాశం నుంచి నక్షత్రాలు దిగివచ్చి నేలపైన వాలినట్టుగా భక్తులు పరవశించారు. పవిత్ర కార్తిక మాసం మూడో సోమవారం వాకాడలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని రామాలయం ఎదురుగా ఖాళీ ప్రదేశంలో పొడవైన సరుగుడు రాటలు పాతి, వెదురుబద్దలతో అరలుగా చేసి, జిగురుమట్టి ఉంచి దానిపై ప్రమిదెలు పెట్టి, రాత్రి తెల్లవార్లు కోటిదీపాలు వెలిగించారు. కరప, పరిసర మండలాల నుంచి భక్తులు తరలివచ్చి కోటి దీపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రతి సమస్యకు న్యాయమైన పరిష్కారం

**కమిషనర్ భావన ఆదేశం**




ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క అర్జీకి న్యాయమైన పరిష్కారాన్ని అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు ఏడు, గ్రీవెన్స్‌కు 50 దరఖాస్తులు అందాయి. ఆయా సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. పరిష్కరించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ సిరిల్, మేనేజర్ సిరీష్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఈత క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి ఈత క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ఐ.రాజు సోమవారం తెలిపారు. సబ్ జూనియర్స్ బాలురు, బాలికల విభాగాల్లో కాకినాడ డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖలో డిసెంబర్ 7, 8 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

### రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్‌లో ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్‌ఎన్ క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై అవగాహన తరగతులను ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఎం.కమలకుమారి సోమవారం ప్రారంభించారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, భారత పౌరులుగా రాజ్యాంగం కల్పించిన హక్కులను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో సదస్సు ప్రారంభం

కాకినాడ క్రైం: యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ సదస్సు కాకినాడ జీజీహెచ్‌లోని మైక్రో బయాలజీ సెమినార్ హాల్లో సోమవారం ప్రారంభమైంది. మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 24 వరకు సదస్సు కొనసాగుతుంది.

### విద్యార్థులకు వివిధ రకాల పోటీలు



చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరప: వేళంగి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు జరిగాయి. ఈ నెల 20న విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, ఎం.రామతులసి, ఉపాధ్యాయులు ఎం.సుజాత, ఎర్రా విక్రమ్ తదితరులు పర్యవేక్షించారు.

# భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



భానులింగేశ్వరస్వామి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో మహాశివుడి విగ్రహం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో త్ర్యయంబకేశ్వరస్వామి



మారేడు దళాలతో అలంకృతులైన భోగి గణపతి



కరప శివాలయంలో పూజలు అందుకుంటున్న రామలింగేశ్వర స్వామి

బోట్‌క్లబ్: శైవ క్షేత్రాలన్నీ భక్తజన సంద్రంగా మారాయి. వందలాది మంది భక్తులు ఆలయాలకు తరలిరావడంతో శివాలయాలు కిటకిటలాడాయి. కార్తిక మాసం మూడో సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో చిన్నారుల కోసం పాలు పంపిణీ చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొడమంచలి కార్తిక్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. స్థానిక భానులింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనం కోసం క్యూ కట్టారు. స్వామివారిని సుమారు ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు, అయ్యప్ప దీక్షాపరుల కోసం ఉచిత అన్నదానం నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. స్థానిక రామారావుపేటలోని శివాలయంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.10, రూ.20 దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం కోసం సుమారు గంట సేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది. స్థానిక సాంబమూర్తినగర్‌లోని శివాలయం, స్థానిక శ్రీనగర్‌లోని శివాలయంలోను భక్తులు దర్శనం కోసం బారులు తీరారు.

**స్ఫటిక శివలింగానికి లక్ష బిల్వార్చన**

కార్తిక మాసం సందర్భంగా స్థానిక భోగి గణపతి పీఠంలో సోమవారం స్ఫటిక శివలింగానికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. సుప్రభాత వేళ నగర వీధుల్లో గణపతి విగ్రహాన్ని చేతపట్టి, నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం స్ఫటిక లింగానికి ఆవు పాలతో అభిషేకం నిర్వహించారు. , లక్ష మారేడు దళాలతో బిల్వార్చన చేశారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ, చతుర్థి ఆరాధన వల్ల సర్వదేవత వ్రత ఫలితం చేకూరుతుందన్నారు. 20 నుంచి 30 ఏళ్ల వయస్సున్న వారు జీవితంలో ఒక్కసారైన చతుర్థి ఉపవాసం చేయడం ద్వారా గణపతి సిద్ధి పొందుతారన్నారు. అనంతరం లక్ష మారేడు దళాలను గణపతికి అందంగా అలంకరించారు.

**పోటెత్తిన భక్తులు**

కాకినాడ రూరల్: కార్తిక మూడో సోమవారం శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. వేకువజామునే శివాలయాలకు చేరుకుని అభిషేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. కాకినాడ రూరల్‌లో నేమాం, పండూరు, తిమ్మాపురం, రమణయ్యపేట గోకుల్ గార్డెన్, ఆర్టీసీ కాలనీ, తూరంగి, కొవ్వాడ, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అభిషేకాలు, దర్శనాలకు వచ్చిన భక్తులు వేకువజామునే దీపారాధనలు చేశారు.

**మార్మోగిన శివనామ స్మరణ**

కరప: మండలంలోని ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు చేయించుకునే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజులు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. విష్ణ్వాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పూజలు నిర్వహించారు. కరపలో ఈఓ కె.తిరుమల రవితేజ, చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి, ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ వారు భక్తులకు ఏర్పాట్లు చేశారు. నడకుదురు, గురజానపల్లి, వాకాడ, కూరాడ, గొర్రిపూడి, పెనుగుదురు, అరట్లకట్ట, వేములవాడ, పెద్దాపురప్పాడు, వేళంగి, కొరిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు తాకిడి పెరిగింది. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లోని స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.